RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

# ఉండి ఎమ్మెల్యే రఘురామ టార్చర్ కేసు

## సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌కు చుక్కెదురు

## మధ్యంతర బెయిల్ నిరాకరించిన హైకోర్టు

అమరావతి,ఆగస్ట్9 : ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజుకు కస్టోడియల్ టార్చర్ కేసులో అప్పటి సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌కు చుక్కెదురైంది. ఆయనకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. రఘురామ ఫిర్యాదుతో గుంటూరులోని నగరపాలెం పోలీసులు నమోదు చేసిన కేసుపై విజయ్‌పాల్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది.రఘురామకు కస్టోడియల్ టార్చర్‌లో గాయాలైనట్లు గతంలో సుప్రీంకోర్టు అభిప్రాయపడిందని సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. విజయ్‌పాల్‌కు ముందస్తు, మధ్యంతర బెయిల్ ఇవ్వొద్దని కోరారు. ఈ వాదనను పరిగణనలోకి తీసుకొని మధ్యంతర ముందస్తు బెయిల్ ఇవ్వడానికి ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. మరోవైపు పిటిషనర్ తరపున జీవీఎస్ కిశోర్ కుమార్ వాదనలు వినిపించారు. నిబంధనల ప్రకారమే రఘురామ కృష్ణరాజును విచారించామని.. కస్టోడియల్ టార్చర్ జరగలేదన్నారు.

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

కర్నూలు సంపుటి : 04 సంచిక : 95 శనివారం 10-08-2024 పేజీలు :04 వెల:రూ.2.00

# గిరిజనులను ముందుకు నడిపించాలి




విజయవాడ,ఆగస్ట్9: గిరిజనులు ఇంకా వెనుకబడి ఉన్నారని,వారిని ఆదుకుని ముందుకు నడిపించాల్సి ఉందని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు, ఏకలవ్యుడిని ఆదర్శంగా తీసుకోవాలి. అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ పాలన అంతానికి పోరాడి ప్రాణ త్యాగం చేశారు. స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూ ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతి కాగలిగారు. అంచెలంచెలుగా ఎదిగిన ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలి. ఆఫ్రికా తర్వాత ప్రపంచంలో రెండో స్థానంలో గిరిజనులు ఉండే దేశం భారత్. అన్ని రంగాల్లో గిరిజనులు ముందుండాలనేదే నా ఆకాంక్ష. మారుమూల ప్రాంతాల్లో ఉండే గిరిజనులు అభివృద్ధి చెందాలి. ప్రధాని వచ్చినప్పుడు అరకు కాఫీ రుచి చూపించాం.తెదేపా ప్రభుత్వ హయాంలో ఏటా ఆదివాసీ

### రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆదర్శం కావాలి

### గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక కృషి

### ఆదివాసీ దినోత్సవంలో సిఎం చంద్రబాబు







దినోత్సవం నిర్వహించాం. గత ఐదేళ్లలో ఈ దినోత్సవాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. ఆదివాసీలంటే శౌర్యం, సహజ ప్రతిభ, నైపుణ్యం కలిగిన వ్యక్తులు. దేశవ్యాప్తంగా 10.42 కోట్ల మంది గిరిజనులున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 27.39 లక్షల మంది ఉన్నారు' అని చంద్రబాబు తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆదివాసీ మహిళలతో కలిసి నృత్యం చేసిన సీఎం.. అనంతరం డప్పు వాయించారు. ఆ తర్వాత అరకు కాఫీ ఉత్పత్తులను పరిశీలించారు. సీఎం చంద్రబాబు, పలువురు ఎమ్మెల్యేలు కాఫీ రుచి చూశారు. అరకు కాఫీ మార్కెటింగ్ తదితర అంశాలపై అధికారులతో సీఎం మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

# పంద్రాగస్ట్ వేడుకలకు ఏర్పాట్లు

### విజయవాడలో సిఎం చంద్రబాబు పతాకావిష్కరణ

### కాకినాడలో డిప్యూటి సిఎం పవన్ జెండా వందనం

### ఆయా జిల్లాల్లో పాల్గొనే మంత్రుల జాబితా విడుదల

అమరావతి,ఆగస్ట్9: రాష్ట్ర, జిల్లా స్థాయిలో స్వాతంత్ర్య వేడుకల నిర్వహణపై ఏపీ సాధారణ పరిపాలన శాఖ ప్రొటోకాల్ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రస్థాయిలో నిర్వహించే వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారని తెలిపింది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయ పతాకాన్ని ఉదయం 9 గంటలకు సీఎం ఆవిష్కరిస్తారని, జిల్లా స్థాయిలో మంత్రులు పతాకావిష్కరణ చేస్తారని తెలిపింది. ఈ మేరకు వేడుకల్లో పాల్గొనే మంత్రులు వివరాలను వెల్లడించింది. కాకినాడలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జాతీయ జెండాను ఎగురవేస్తారని, అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలెక్టర్ దినేశ్‌కుమార్ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపింది. జిల్లాల్లో పాల్గొనే మంత్రుల వివరాలను వెల్లడించింది. శ్రీకాకుళం- అచ్చెన్నాయుడు, విజయనగరం- కొండపల్లి శ్రీనివాస్, పార్వతీపురం మన్యం- గుమ్మిడి సంధ్యారాణి, విశాఖపట్నం- అనగాని సత్యప్రసాద్, అనకాపల్లి- వంగలపూడి అనిత, తూర్పుగోదావరి- కందుల దుర్గేశ్, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ- వాసంశెట్టి సుభాష్, పశ్చిమగోదావరి- నిమ్మల



రామానాయుడు, ఏలూరు- కొలుసు పార్థసారథి, కృష్ణా- కొల్లు రవీంద్ర, గుంటూరు- నారా లోకేశ్‌పల్నాడు- నాదెండ్ల మనోహర్, బాపట్ల- గొట్టిపాటి రవికుమార్, ప్రకాశం- డోలా బాలవీరాంజనేయస్వామిశ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు-పి. నారాయణ, చిత్తూరు- సత్యకుమార్, కడప- ఎన్ఎండీ ఫరూక్, అన్నమయ్య- మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, తిరుపతి- ఆనం రామనారాయణరెడ్డి, నంద్యాల- బీసీ జనార్దన్‌రెడ్డి, కర్నూలు- టీజీ భరత్, అనంతపురం- పయ్యావుల కేశవ్, శ్రీ సత్యసాయి- సవితలు జెండా ఆవిష్కరణలో పాల్గొంటారు.

# మనీష్ సిసోడియాకు భారీ ఊరట

### బెయిల్ మంజూరు చేసిన సుప్రీం కోర్టు

### 17 నెలల సుదీర్ఘ కాలంతరవాత విముక్తి

న్యూఢిల్లీ,ఆగస్ట్9 : సిసోడియాకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను సుప్రీం మంజూరు చేసింది. ఈ మేరకు ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం, ఆప్ నేత మనీష్ సిసోడియా బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు వెలువడింది. ఎక్సైజ్ పాలసీ కేసులో 17 నెలల తర్వాత ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం తుది తీర్పును వెలువరించింది. ప్రతి సోమవారం దర్యాప్తు సంస్థ ముందు హాజరుకావాలని సిసోడియాను సుప్రీం ఆదేశించింది. సీబీఐ, ఈడీ కేసులను విడివిడిగా సుప్రీం విచారించింది. విచారణ పూర్తయిన అనంతరం కొద్ది రోజుల క్రితం తీర్పును రిజర్వ్ చేసి నేడు వెలువరించింది. ఈ క్రమంలోనే 17 నెలల తర్వాత మనీష్ సిసోడియా బయటకు రానున్నారు. కొద్ది రోజుల క్రితం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ మద్యం విధానం కేసులో బెయిల్ లభించింది. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు సైతం బెయిల్ మంజూరు కావడంతో ఆప్ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. అవినీతి, మనీలాండరింగ్ కేసుల్లో సిసోడియాకు బెయిల్ సుప్రీం బెయిల్ ఇచ్చింది. ఏ నిందితుడిని కాలపరిమితి లేకుండా జైలులో ఉంచలేరని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేసు విచారణలో పురోగతి లేకపోతే... ఒక పరిమితి దాటిన తర్వాత జైలులో ఉంచలేరని పేర్కొంది. అలా కాదు



అని... జైలులో ఉంచాలి అనుకుంటే ఆ వ్యక్తి హక్కులు హరించడమేనని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. బెయిల్‌కి అప్లికేషన్ పెట్టుకోవడం, బెయిల్ పొందడం వారి హక్కు అని ధర్మాసనం పేర్కొంది. సిసోదియాకు బెయిల్ ఇవ్వొద్దు అని దర్యాప్తు సంస్థలు చేసిన వాదనలు అన్నింటినీ ధర్మాసనం తోసిపుచ్చింది. విచారణ ఆలస్యం కావడానికి సిసోడియా కూడా కారణమన్న ట్రయల్ కోర్టు ఆదేశాలను సైతం పక్కనబెట్టింది. ఈ విషయంలో ఢిల్లీ హైకోర్టు చేసిన ప్రతికూల వ్యాఖ్యలను కూడా సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. బెయిల్ అనేది నియమమని.. జైలు మినహాయింపు అని ట్రయల్ కోర్టులు, హైకోర్టులు గ్రహించాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ట్రయల్ వేగంగా జరిగేందుకు సిసోడియా సహరించాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. సిసోడియా బెయిల్‌ను ఈడీ, సీబీఐ వ్యతిరేకించాయి. సిసోడియా విచారణకు సహకరించడం లేదని, జాప్యం చేస్తున్నారని, అనవసరపు పత్రాలను తనిఖీ చేయాలని కోరుతున్నారని సుప్రీంకోర్టుకు అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు తెలిపారు. సిసోడియాకు బెయిల్ ఇస్తే సాక్ష్యాలను, సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని బెయిల్ ఇవ్వొద్దని సుప్రీంకోర్టును దర్యాప్తు సంస్థలు కోరాయి. గతేడాది అక్టోబర్ నుంచి తనపై ఉన్న కేసుల్లో ఎలాంటి పురోగతి లేదని కాబట్టి తనకు బెయిల్ మంజూరు చేయాలని సుప్రీంకోర్టును సిసోడియా కోరారు. మొత్తానికి ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది.

# రాష్ట్రంలో ఆరాచక ..రెడ్ బుక్ పాలన



నంద్యాల,ఆగస్ట్9 : రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన కొనసాగుతోందని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏపీలో కూటమి ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రెడ్ బుక్ పాలన సాగిస్తున్నారు. ఊళ్లలో ఆధిపత్యం కోసం వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారు. రాళ్లు, రాడ్లు, కత్తులతో గ్రామంలో దాడులు చేస్తున్నారు. ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. రాష్ట్రంలో ఆరాచక పాలన జరుగుతుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన కాదు.. రెడ్ బుక్ పాలన చేస్తున్నారని అన్నారు. ఏపీలో లా అండ్ ఆర్డర్ నాశనం చేస్తున్నారు. ఏపీలో జరుగుతున్న హత్యల్లో చంద్రబాబు, లోకేష్‌లను ముద్దాయిలుగా చేర్చాలన్నారు. కేవలం ఆధిపత్యం కోసమే దాడులకు తెగబడుతున్నారని వైఎస్ జగన్ ఆరోపించారు. కావాలనే భయానక వాతావరణం సృష్టిస్తున్నారని.. ఇదెక్కడి పాలన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీతారామపురంలో హత్యకు గురైన సుబ్బారాయుడు కుటుంబ సభ్యులను వైఎస్ జగన్ పరామర్శించారు. ఈ క్రమంలో వారి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం, వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ..'రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోంది. మారణహోమం సృష్టించే పాలన చేస్తున్నారు. రాష్ట్రంలో



### ఆధిపత్యం కోసం వ్యవస్థల భ్రష్టు

### ఆధిపత్యం కోసమే దాడులకు తెగబడుతున్నారు

### సీతారామపురంలో సుబ్బారాయుడు కుటుంబానికి పరామర్శ

### హత్య కేసులో చంద్రబాబు, లోకేశ్‌లను చేర్చాలని జగన్ డిమాండ్



రెడ్ బుక్ పాలన అమలు చేస్తున్నారు. ఉళ్లలో ఆధిపత్యం కోసం వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ నాశనం చేస్తున్నారు. పోలింగ్ బూత్‌లో ఏజెంట్‌గా కూర్చున్నాడని చంపేశారు. పోలీసుల సమక్షంలోనే పెద్దసుబ్బారాయుడిని చంపేశారు. సుబ్బారాయుడి భార్యపై కూడా దాడి చేశారు. పోలీసుల ఎదుటే నిందితులు ఉన్నా ఎందుకు పట్టుకోలేదు?. నిందితులు పారిపోవడానికి పోలీసులు సహకరించారు. ఎవరి ప్రోద్భలంతో పోలీసులు నిందితులకు సహకరించారు. ప్రతీచోటా ఇలాంటి ఘటనలే జరుగుతున్నాయి. నిందితుల కాల్ డేటా చూస్తే ఎవరు చేయించారో తెలుస్తుంది. హత్య చేయించిన వారిని కూడా జైల్లో పెట్టాలి. హత్య జరిగిన తర్వాత గ్రామానికి అడిషనల్ ఫోర్స్ ఎందుకు పంపలేదు?. హత్య చేసిన వారిని ఎందుకు పట్టుకోలేదు. ఇంత జరుగుతున్నా అదనపు బలగాలు ఎందుకు రాలేదు?. తుపాకులు, కత్తులు, రాడ్డు, కర్రలతో దాడులు చేస్తున్నారు. చంద్రబాబు, నారా లోకేష్ అండదండలతో ఎస్ఐ సమక్షంలో నరికేశారు. టీడీపీ ఎమ్మెల్యేలు మీటింగ్స్ పెట్టి చంపండి అంటూ చెబుతున్నారు. ఈ హత్యల్లో చంద్రబాబు, లోకేష్‌లను కూడా ముద్దాయిలుగా చేర్చాలని అన్నారు. చంద్రబాబు మహిళలను మోసం చేశారు. ప్రతి విద్యార్థికి రూ. 15 వేలు ఇస్తానని చెప్పి చంద్రబాబు మోసం చేశారు. ఎన్నికల సమయంలో మాయ మాటలు చెప్పారు. మన ప్రభుత్వమే ఉండి ఉంటే ఇప్పటికే అందరికి రైతు భరోసా అందేదని వైఎస్ జగన్ అన్నారు. నంద్యాల జిల్లా సీతారామాపురంలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుబ్బారాయుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లారు. పరామర్శ అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతోందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అడుగుతారేమోనని సీఎం చంద్రబాబు భయానకం వాతావరణ కల్పిస్తున్నారంటూ జగన్ తనదైన శైలిలో ఆరోపణలు చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇంటింటికి టీడీపీ వాళ్లను పంపించి అనేక హామీలు ఇస్తామని చెప్పించారని, కానీ అధికారంలోకి రాగానే మోసం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. జగన్ అధికారంలో ఉండుంటే ప్రతి రైతుకు సొమ్ము అందేదని, అందరికీ సంక్షేమ పథకాలు అందేవని పేర్కొన్నారు. గ్రామాల్లో ఆధిపత్యం కోసం దాడులు చేస్తూ లా అండ్ ఆర్డర్ సమస్య సృష్టిస్తున్నారని, సీతారామాపురంలో సుబ్బరాయుడు కుటుంబ సభ్యులు పోలింగ్ బూత్‌లో ఏజెంటుగా కూర్చున్నాడని, అతడిని దారుణంగా హత్య చేశారని ఆరోపణలు చేశారు. ఈ ఘటనతో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా అని అనుమానం కలుగుతోందని వ్యాఖ్యానించారు. నారపురెడ్డి అనే వ్యక్తి ఎస్పైకి ఫోన్ చేసినా పోలీసులు సకాలంలో స్పందించ లేదని, కొంతసేపటికి ఎస్పై ఊరికి వచ్చినా పైఅధికారులకు ఫోన్లు చేస్తూ ప్రేక్షక పాత్ర పోషించారని నిందలు వేశారు. నారపురెడ్డి అనే వ్యక్తి ఫోన్ చేసినా పోలీసులు అదనపు బలగాలను పంపలేదని అన్నారు.

సుబ్బరాయుడుని హత్య చేసిన వారిని పోలీసులు వెంటనే ఎందుకు అరెస్టు చేయలేదని జగన్ ప్రశ్నించారు. నిందితుల కాల్ డేటా బయటకు తీస్తే అసలు వ్యక్తులు వెలుగులోకి వస్తారని, కేవలం మర్డర్ చేసిన వారిపైనే కాదు, హత్య చేయించిన వారిపై కూడా కేసులు నమోదు చేయాలని జగన్ డిమాండ్ చేశారు. సీతారామాపురంలో హత్యకు గురైన సుబ్బారాయుడు కుటుంబానికి అండగా ఉంటానని, నిందితులకు కఠిన శిక్ష పడేంత వరకు న్యాయ పోరాటం చేస్తానని అన్నారు. ఇక సుబ్బరాయుడు కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని జగన్ డిమాండ్ చేశారు. ఇక శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి హత్యా రాజకీయాలను ప్రోత్సాహిస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. మండలానికి ఇద్దరిని చంపాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మీటింగ్‌లో చెప్పారని, ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోందని మాజీ సీఎం అన్నారు. బుడ్డా రాజశేఖర్ రెడ్డిపై పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయ లేదని ఆయన ప్రశ్నించారు.

# గంగమ్మ ఒడిలో శివయ్య...

కర్నూలు, ఆగస్టు 9, నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సంగమేశ్వరంలో ఉంది సంగమేశ్వర స్వామి దేవాలయం. వేలఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆలయం ఏడాదిలో దాదాపు 8 నెలల పాటూ గంగమ్మ ఒడిలోనే ఉంటుంది. ఎగువ నుంచి కురిసే భారీ వర్షాలకు వరదనీరొచ్చి కృష్ణానదిలో చేరుతుంది. ఈ ఏడాది కూడా భారీగా వరదనీరు చేరడంతో ఎప్పటిలానే సంగమేశ్వరఆలయం నీటమునిగింది. సంగమేశ్వరుడు కృష్ణానదిలో నిరంతర అభిషేకం చేయించుకుంటున్నాడా అన్నట్టుంది ఈ దృశ్యం. ఒడ్డునుంచే హారతి ఇస్తున్నారు పూజారి...ఏడాదిలో 8 నెలలపాటు నీటిలో ఉండి కేవలం 4 నెలలు మాత్రమే భక్తులకు దర్శనభాగ్యం కలిగించే ఆలయం ఇది. సప్తనదులు సంగమించే ప్రదేశంలో ఉన్న సంగమేశ్వరాలయంలో పూజలందుకుంటున్న శివలింగం అత్యంత విశిష్టమైనది . వేల ఏళ్లక్రితం ధర్మరాజు ప్రతిష్టించిన వేప శివలింగం ఇది. పాండవులు అరణ్యవాసం చేస్తున్న సమయంలో శ్రీకృష్ణుడి సూచన మేరకు ధర్మరాజు ఈ శివలింగాన్ని ప్రతిష్టించాడని స్థలపురాణం. ఏడు నదులు సంగమించే సంగమేశ్వరంలో శివపూజ చేయమని శ్రీకృష్ణుడు చెప్పడంతో..ఇక్కడ వేపచెట్టును నరికి శివలింగం చేసి పూజించాడట ధర్మరాజు. వేలఏళ్లక్రితం ప్రతిష్టించిన ఇక్కడ శివలింగం ఇప్పటికీ చెక్కుచెదరకపోవడం విశేషం. సంగమేశ్వరాలయం మాత్రమే కాదు.. మహా మునులు తపస్సు చేసిన ప్రదేశం ఇది...అగస్త్యుడు , విశ్వామిత్రుడు లాంటి మహర్శులు ఇక్కడ తపస్సు ఆచరించారని చెబుతారు. ఈ సంగమేశ్వరం ప్రదేశంలో పితృదేవతలకు తర్పణాలు విడిచినా, అస్తికలు కలిపినా వారికి స్వర్గలోక ప్రాప్తి ఉంటుందని స్కాందపురాణంలో ఉంది. కృష్ణ, వేణి,తుంగ,భద్ర, మలపహరిని, భవనాసిని, భీమరది వంటి ఏడు నదులు కలసి ప్రవహించే ఈ ప్రదేశంలో స్నానమాచరిస్తే ఏడు జన్మల పాపాలు నశిస్తాయని భక్తుల విశ్వాసం. ఇక్కడ నదిలో స్నానమాచరించిన తర్వాత ఒడ్డున కూర్చుని గాయత్రి మంత్ర జపం చేస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందంటారు. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన ఈ ఆలయం క్రమంగా శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం కనిపిస్తున్న ఆలయాన్ని 200 ఏళ్ల క్రితం స్థానిక ప్రజలంతా కలసి పునర్నిర్మించారి చెబుతారు. ప్రాకారానికి ఉత్తరాన గోపురద్వారం, పశ్చిమ దక్షిణ ద్వారాలపై మండపాలు నిర్మించి ఉండేవి కానీ ప్రస్తుతం అవేమీ కనిపించవు. ప్రస్తుతం అందరూ దర్శించుకుంటున్న ప్రధాన ఆలయం సాదాసీదాగా ఉంటుంది. ముఖ మండపై పూర్తిగా శిథిలమైపోయింది. అంతరాలయం మాత్రమే దర్శమనిస్తోంది. గతంలో లలితాదేవి, వినాయకుడికి వేర్వేరు ఆలయాలుండేవి..కానీ ఆ ఆలయాలు శిథిలం అయిపోవడంతో ఈ విగ్రహాలను తీసుకొచ్చి శివుడి సమీపంలోనే దర్శనానికి ఉంచారు. ఇక ఉపాలయాల్లో ఉండే దేవతామూర్తుల విగ్రహాలను కర్నూలు జిల్లాలో వివిధ ఆలయాలకు తరలించారు. కర్నూలు నుంచి ఆత్మకూరు వెళ్లి అక్కడి నుంచి 40 కిలోమీటర్లు ప్రయాణిస్తే సంగమేశ్వరం చేరుకోవచ్చు. తెలంగాణ నుంచి వెళ్లేవారు అయితే మహబూబ్ నగర్ నుంచి సోమశిల వరకూ బస్సు...అక్కడి నుంచి బోటు ద్వారా సంగమేశ్వరం వెళ్లొచ్చు. ప్రస్తుతం ఈ ఆలయం నీటిలో మునిగిఉంది...మళ్లీ శంకరుడిని దర్శించుకోవాలంటే...మళ్లీ 8 నెలల వరకూ ఆగాల్సిందే.

# మూడు జిల్లాలకు గజరాజుల సమస్యలకు చెక్...

తిరుపతి, ఆగస్టు 9,పవన్ తనకు ఇష్టమైన శాఖలను నిర్వర్తిస్తున్నారు. పల్లెలన్నా, అడవులు అన్నా పవన్ కు ఎంతో ఇష్టం. తన సినిమాల్లో సైతం ఈ రెండు ఇతివృత్తాలను అధికంగా తీసుకుంటారు. ఇప్పుడు రాజకీయాల్లోకి వచ్చాక అదే పరంపరను కొనసాగిస్తున్నారు. డిప్యూటీ సీఎం పోస్టుతో పాటు ఆరు కీలక శాఖలను నిర్వర్తిస్తున్నారు. అందులో అటవీ శాఖ ఒకటి. ప్రధానంగా అడవులను సంరక్షించే చర్యలు చేపడుతున్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ పై దృష్టి పెట్టారు. ఉక్కు పాదంతో అణచివేయాలని నిర్ణయించుకున్నారు. మరోవైపు అటవీ జంతువుల సంరక్షణకు కూడా నడుంబిగించారు. అరుదైన జంతుజాలాలను పరిరక్షించుకోవాలని భావిస్తున్నారు. అదే అటవీ జంతువుల నుంచి మనుషులను సైతం రక్షించాలని చూస్తున్నారు. ఏపీలో పలు ప్రాంతాల్లో వన్యప్రాణుల భారీ నుంచి ప్రజలను రక్షించేందుకు సత్వర చర్యలు ప్రారంభించారు. అందులో భాగంగానే కర్ణాటకలో పర్యటిస్తున్నారు. అక్కడ అటవీ శాఖ మంత్రితో ప్రత్యేక చర్చలు జరపనున్నారు. ఆ చర్చలు విజయవంతం అయితే.. ఏపీలో ఒక దీర్ఘకాలిక సమస్యకు పరిష్కార మార్గం దొరకనుంది.అదే జరిగితే ఏ ప్రభుత్వము చేయని ప్రయత్నం చేసినట్టు అవుతుంది. టిడిపి కూటమి ప్రభుత్వంతో పాటు పవన్ కు ప్రత్యేక గుర్తింపు లభించనుంది. అదే సమయంలో ప్రజలు పడుతున్న బాధకు శాశ్వత పరిష్కారం దొరకనుంది. గతంలో ఏ ప్రభుత్వము ఇటువంటి ప్రయత్నం చేయలేదని తెలుస్తోంది. అందుకే ప్రతి ఒక్కరూ ఆహ్వానిస్తున్నారు. పవన్ కర్ణాటక ఎందుకు వెళ్లారా? అని ఆరా తీస్తున్నారు.ఏపీలో చాలా జిల్లాల్లో వన్యప్రాణుల బెడద అధికంగా ఉంది. ప్రధానంగా ఉమ్మడి చిత్తూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తున్నాయి. పంటలను ధ్వంసం చేస్తున్నాయి. గ్రామాల మీద పడి విధ్వంసం సృష్టిస్తున్నాయి. అప్పుడప్పుడు ప్రాణహానిసైతం జరుగుతోంది. అటవీ శాఖ కేవలం కంటి తుడుపు చర్యలకే పరిమితమవుతోంది. ఏనుగులను అడవులకు తరలించే ప్రయత్నాలు సైతం ఫలించడం లేదు. ఈ సమస్య నానాటికీ తీవ్రతరం అవుతోంది. అందుకే అటవీ శాఖమంత్రిగా ఉన్న పవన్ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. దశాబ్దాలుగా ఏనుగుల సమస్య అధికంగా ఉంది. ఒడిస్సా లోని లఖేరి అటువుల నుంచి ఏనుగులు తరలి వచ్చాయి. ఉత్తరాంధ్ర ప్రాంతంలో సంచరిస్తూ ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలకు గురిచేస్తున్నాయి. అటు చిత్తూరులో సైతం అదే పరిస్థితి ఎదురైంది. ఈ తరుణంలో చాలామంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది ఎకరాల పంటలకు నష్టం వాటిల్లుతోంది. ఏనుగుల నియంత్రణకు రకరకాల పథకాలు, ప్రయోగాలు తెరపైకి వచ్చాయి. ఏనుగుల క్యారీడర్, అడవుల్లో ట్రంచ్ల ఏర్పాటు వంటి అంశాలు చర్చకు వచ్చాయి. కానీ ఇవేవీ కార్యరూపంలోకి రాలేదు. అందుకే అధికారంలోకి వచ్చిన వెంటనే వీటికోసం ప్రత్యేక పరిష్కార మార్గం చూపిస్తామని హామీ ఇచ్చారు.అధికారంలోకి వచ్చిన వెంటనే పవన్ అటవీశాఖ పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. వన్యప్రాణుల నియంత్రణకు ఏం చేయాలి అన్నదానిపై అధికారుల నుంచి నివేదిక తెప్పించుకున్నారు. అయితే ఏనుగులను తరమాలంటే కుమ్కి ఏనుగులు అవసరమని అటవీ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చిన వాటికే కుమ్కి ఏనుగులు అంటారు. దీంతో ఈ ఏనుగుల కోసం అన్వేషణ మొదలుపెట్టారు. అది బెంగళూరులో ఉంటాయని అధికారులు చెప్పడంతో అక్కడి ప్రభుత్వంతో ఆశ్రయించారు పవన్. వాటిని తీసుకొచ్చి ఆపరేషన్ మొదలు పెట్టడానికి నిర్ణయించారు. అందుకే ఈరోజు పవన్ బెంగళూరు పర్యటనకు వెళ్లారు. అక్కడి అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ బి. ఖండ్రేతో చర్చలు జరపనున్నారు. త్వరలో ఏనుగుల సమస్యకు పరిష్కార మార్గం దొరుకుతుందని బాధిత జిల్లాల ప్రజలు ఆశిస్తున్నారు.

# వైసీపీలో ఏం జరుగుతోంది...



## వరుస షాక్ లు ఇస్తున్న నేతలు

కాకినాడ, ఆగస్టు 9, ఈ ఎన్నికల్లో వైసిపి దారుణ పరాజయాన్ని మూటగట్టుకుంది.ఇప్పుడిప్పుడే ఓటమి నుంచి కోలుకుంటోంది. అయితే ఆ పార్టీకి షాక్ లు తప్పడం లేదు. నిన్న ఒక్కరోజే మూడు ఘటనలు ఆ పార్టీని దారుణంగా దెబ్బతీశాయి. పార్టీ శ్రేణులను తీవ్ర నిరాశకు గురిచేశాయి. 2019లో 151 అసెంబ్లీ స్థానాల్లో ఆ పార్టీ అద్భుత విజయం సాధించింది. దేశాన్ని తన వైపు చూసుకునేలా చేసింది. కానీ ఐదేళ్ల తిరిగేసరికి దానికి మించి ఓటమితో మరోసారి దేశంలో చర్చనీయాంశంగా మారింది. కేవలం 11 స్థానాలతో సరిపెట్టుకుంది. ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. భారీ ఓటమితో పార్టీలో వైఫల్యాలు సైతం బయటపడుతున్నాయి. ఇక పార్టీకి భవిష్యత్తు లేదని భావిస్తున్న నేతలంతా వైసీపీకి గుడ్ బై చెబుతున్నారు. ఓటమి ఎదురైన వెంటనే విజయవాడ ఎంపీగా పోటీ చేసిన కేశినేని నాని క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై చెప్పారు. ప్రకాశం జిల్లాకు చెందిన సిద్ధా రాఘవరావు పార్టీకి రాజీనామా చేశారు. సినీ నటుడు అలీ తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని ప్రకటన చేశారు. గుంటూరు జిల్లాకు చెందిన మద్దాలి గిరి, కిలారి రోశయ్య పార్టీకి రాజీనామా చేశారు. ఏ పార్టీలో చేరకపోయినా వైసీపీకి దూరమయ్యారు. అయితే ఫలితాలు వచ్చిన వెంటనే సీనియర్లు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. జూనియర్లు అస్సలు మాట్లాడడం మానేశారు.రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ప్రతినిధులు వైసీపీకి గుడ్ బై చెబుతున్నారు. ఇప్పటికే విశాఖ నగరపాలక సంస్థ నుంచి కార్పొరేటర్లు టిడిపి, జనసేనలోకి క్యూ కట్టారు. ఇటువంటి తరుణంలో విశాఖ స్థాయి సంఘ ఎన్నికలు జరిగాయి. పదికి పది స్థానాలను టిడిపి కూటమి అభ్యర్థులు దక్కించుకున్నారు. దీంతో విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ముందు వైసీపీకి గట్టి షాక్ తగిలింది.పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు పిఠాపురం నియోజకవర్గం నుంచి. 2019 ఎన్నికల్లో ఇదే సీటు నుంచి గెలిచారు పెండ్యం దొరబాబు. కానీ పవన్ పోటీ చేసేసరికి దొరబాబును పక్కన పెట్టారు. కాకినాడ ఎంపీగా ఉన్న వంగా గీతను తెరపైకి తెచ్చారు. అయితే ఐదేళ్లు సిట్టింగ్ ఎమ్మెల్యే గా ఉంటూ పార్టీ కోసం కష్టపడితే తనను పక్కన పెట్టడాన్ని దొరబాబు జీర్ణించుకోలేకపోయారు. అయితే ఆయన జనసేనలో చేరతారని ప్రచారం జరిగింది. కానీ అప్పట్లో వైసీపీలోనే కొనసాగారు. అయితే ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో వైసీపీ నుంచి బయటకు వచ్చేశారు దొరబాబు. నిన్ననే పార్టీకి రాజీనామా చేశారు. దొరబాబు తో పాటు మరికొంతమంది వైసీపీలో వీడుతారని ప్రచారం జరుగుతోంది. ఇది రెండో షాక్.అనంతపురం జిల్లాలో వైసీపీ తుడుచుపెట్టుకుపోయింది. కనీసం ఒక్క సీటు కూడా రాలేదు. ఈ తరుణంలో అక్కడ పార్టీకి అండగా నిలిచేవారు కరువయ్యారు. ఈ నేపథ్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైల నరసింహయ్య పార్టీకి గుడ్ బై చెప్పారు. వ్యక్తిగత కారణాలతో తాను పార్టీని వీడుతున్నట్లు చెబుతున్నా.. వేరే పార్టీలో చేరేందుకే ఆయన రాజీనామా బాట పట్టినట్లు ప్రచారం జరుగుతోంది. మరో వైపు కవైపు విశాఖ జిల్లా స్థానిక సంస్థల ప్రతినిధులతో సమావేశం అవుతూనే.. పోలింగ్ వరకు వారికి సేఫ్ జోన్ లోకి తీసుకెళ్లడానికి ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.వైసిపికి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులను బెంగళూరు క్యాంపునకు తరలించనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ప్రత్యేకంగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.అయితే ఇప్పటికే టిడిపి కూటమి సైతం బలమైన అభ్యర్థి పీలా గోవింద సత్యనారాయణ ను అభ్యర్థిగా ఎంపిక చేసింది. ఆయన సైతం బలమైన నేత కావడంతో.. నియోజకవర్గాల వారీగా స్థానిక సంస్థల ప్రతినిధుల మద్దతు కోసం ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ తరపున వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పోటీ చేశారు. ఎనిమిది వందల పైచిలుకు స్థానిక సంస్థల ఓట్లకు గాను.. 600 మందికి పైగా వైసీపీ ప్రజాప్రతిని ధులు ఉన్నారు. టిడిపి కూటమికి కేవలం 200 మంది ప్రతినిధుల బలం మాత్రమే ఉంది. దీంతో అప్ప ట్లో విపక్షం పోటీ కూడా పెట్టలేదు. దీంతో వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలకు ముందు ఆయన జనసేనలోకి ఫిరాయించారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. మొత్తానికైతే ఇప్పుడిప్పుడే ఓటమి నుంచి తేరుకుంటున్న తరుణంలో.. ఇలా నేతలు పార్టీ నుంచి బయటకు రావడం, స్థానిక ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు రావడం వైసిపికి షాకింగ్ ఇచ్చే పరిణామాలే.

# విజయవాడ స్కూళ్లలో డ్రగ్స్....



విజయవాడ, ఆగస్టు 9,: ఆంధ్రప్రదేశ్‌లో మాదక ద్రవ్యాల వినియోగంపై గత కొంత కాలంగా నెలకొన్న ఆందోళనకు అద్దంపట్టే ఘటన వెలుగు చూసింది. స్కూల్ విద్యార్థుల బ్యాగ్‌లలో డ్రగ్స్, లక్షల్లో నగదు పట్టుబడింది. ఆ తర్వాత వరుస ఘటనలు వెలుగు చూడటంతో పాఠశాలల్లో ఏం జరుగుతుందనే ఆందోళన నెలకొంది.వారం రోజుల క్రితం విజయవాడలో ప్రముఖ విద్యా సంస్థలో ప్రిన్సిపల్ ఆకస్మిక తనిఖీలు చేస్తుండగా కొందరు విద్యార్థులు టాయిలెట్స్‌లో డ్రగ్స్ వినియోగిస్తూ కనిపించారు. వెంటనే 9,10వ తరగతులకు చెందిన విద్యార్థుల స్కూల్ బ్యాగ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేయడంతో కొందరి వద్ద ఎలక్ట్రానిక్ సిగర్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు లభించాయి. వాటిని వినియోగిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి స్కూల్ యాజమాన్యం కౌన్సిలింగ్ ఇచ్చింది. బాధ్యులైన విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో ఆందోళన కలిగించే విషయాలు వెలుగు చూశాయి.కొద్ది రోజుల క్రితంఇదే పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి ఆన్‌లైన్ గేమ్స్‌లో లక్షల రుపాయలు సంపాదించాడు. వాటిని తన వద్ద ఉంచుకుంటే ఇబ్బంది కలుగుతుందని భావించి దాదాపు ఆరేడు లక్షల రుపాయల నగదును స్నేహితులకు ఇచ్చాడు. ఆ డబ్బును ఇళ్లకు తీసుకువెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీయడంతో స్నేహితుడు ఇచ్చాడని చెప్పడంతో వారు పాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు.స్కూల్లో విచారణ చేపట్టడంతో సదరు విద్యార్థి నిరంతరం ఆన్‌లైన్‌లో రకరకాల బెట్టింగ్ గేమ్స్ ఆడుతున్నట్టు తేలింది. వాటితో సంపాదించిన డబ్బును స్నేహితులకు ఇవ్వడంతో ఈ వ్యవహారం బయటపడింది. ఈ ఘటనకు బాధ్యుడైన విద్యార్థిపై కూడా స్కూల్ యాజమాన్యం చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఉత్తరాదికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ డబ్బును పాఠశాలకే వదిలేసినట్టు సమాచారం. ఈ డబ్బును ఏమి చేయాలో తెలియక మల్లగుల్లాలు పడుతున్నారు.9వ తరగతి చదివే కొంతమంది విద్యార్థులు ఇటీవల విజయవాడలోని ఓ స్టార్ హోటల్లో పార్టీ చేసుకున్నారు. 14ఏళ్లలోపు పిల్లలు మాత్రమే ఉన్న బృందానికి నగరంలోని చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై ఉన్న స్టార్ హోటల్లో పార్టీ చేసుకోడానికి అనుమతించారు. ఈ ఘటనలో కొందరు విద్యార్థులు బీర్లు సేవించినట్టు తెలిసింది. హోటల్లో బర్త్ డే పార్టీ వ్యవహారం ఆలస్యంగా తెలిసిన పేరెంట్స్ స్కూల్ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. స్కూల్ బయట జరిగే ఘటనలకు తామెలా బాధ్యులం అవుతామని ప్రశ్నించడంతో చేసేది లేక పేరెంట్స్ మిన్నకుండి పోయారు.పాఠశాలలో టాయిలెట్ ప్రదేశాలు మినహా, ప్రతి ప్రాంతం కవర్ అయ్యేలా సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంచినా విద్యార్థులు గాడి తప్పుతున్నారని స్కూల్ యాజమాన్యం చెబుతోంది. ఇళ్ల వద్ద తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవడటంతోనే ఈ సమస్య వస్తోందని చెబుతున్నారు. పిల్లలు ఏమి చేస్తున్నారో, ఎవరితో తిరుగుతున్నారో గమనించే తీరిక కూడా చాలామందికి ఉండటం లేదని ఇదే సమస్యలకు అసలు కారణమని స్కూల్ యాజమాన్యం చెబుతోంది. రోజుకు 8 గంటలు మాత్రమే స్కూల్ ఆవరణలో ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉంటుందని మిగిలిన సమయంలో వారెక్కడ ఉంటున్నారో, ఏమి చేస్తున్నారో తమకెలా తెలుస్తుందని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. మొబైల్ అడిక్షన్ విద్యార్థులకు ప్రధాన శత్రువుగా మారిందని చెబుతున్నారు.7,8 తరగతులకు వరకు క్రమశిక్షణ, మంచి ప్రతిభ చూపించిన విద్యార్థులు కూడా 9,10 తరగతుల్లోకి రాగానే ఒక్కసారిగా మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నట్టు తెలుస్తోంది. బుధవారం పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో ఈ విషయాలను వివరించారు. విజయవాడలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో ఒకటైన సదరు పాఠశాలలో నెలకొన్న పరిస్థితులపై తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమైంది. విజయవాడలో విచ్చలవిడిగా లభిస్తున్న మాదకద్రవ్యాలు, మొబైల్ అడిక్షన్, ఆన్‌లైన్ బెట్టింగ్స్ పాఠశాల విద్యార్థుల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.ఏపీలో గత కొన్నేళ్లుగా రకరకాల సామాజిక రుగ్మతలు పెరుగుతున్నాయి. మాదక ద్రవ్యాల వ్యవహారం మాత్రమే ప్రధానంగా ప్రచారంలోకి వస్తున్నా ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్స్ అంతకు మించి సాగుతున్నాయి. విజయవాడ వంటి నగరంలో కూడా ఈ తరహా బెట్టింగ్‌లు నిర్వహించే కేంద్రాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. రకరకాల ఆన్‌లైన ఆటల పేరుతో వేర్వేరు ముఠాలు చెలరేగిపోతున్నాయి.ఈ ముఠాల గురించి పోలీసులకు తెలిసినా వాటిని చూసిచూడనట్టు వదిలేస్తున్నారు. నెలవారీ మామూళ్లు తీసుకుని ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బెట్టింగ్‌ల లో డబ్బు వసూళ్ల కోసం దాడులు జరుగుతున్న ఉదంతాలు కూడా ఉన్నాయి.నగరంలోని బార్ అండ్ రెస్టారెంట్లలో నిత్యం ఈ ఆన్‌లైన్ జూదం నడుస్తోంది. పెద్ద సంఖ్యలో ప్రాంతాల వారీగా ముఠాలు వీటిని నడిపిస్తున్నాయి. ఈ తరహా కార్యక్రమాలను గతంలో యాంటీ గుండా స్క్వాడ్‌లు ఉక్కుపాదంతో అణిచివేసేవి. రకరకాల కారణాలతో టాస్క్‌ఫోర్స్‌లు నిర్వీర్యమైపోయాయి. వ్యవస్థీకృత నేరాలను అదుపు చేయడంకంటే వాటితో కలిసిపోతేనే ఎక్కువ లాభమని దిగువ స్థాయి సిబ్బంది భావిస్తున్నారు.పేకాట క్లబ్బులు, గంజాయి పెడ్లర్లు, ఆన్‌లైన్ గేమ్ నిర్వాహకులు, డ్రగ్ పెడ్లర్లతో ఎస్బీ బృందాలు ఏళ్ల తరబడి సావాసం కొనసాగిస్తున్నాయి. గాంధీనగర్‌లో ఉన్న కొన్ని బార్ అండ్ రెస్టారెంట్లలో బహిరంగంగా నిత్యం ఈ దందాలు నడుస్తున్నా పోలీసులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కొన్ని బార్లలో పోలీసుల పర్యవేక్షణలో ఆన్‌లైన్ జూదాలు నడుస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

# అన్నా క్యాంటీన్ ను సందర్శించిన టీడీపీ నేత వర్మ

పిఠాపురం,చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో రాష్ట్రంలో అన్నా క్యాంటీన్లను ఏర్పాటుచేసి పేదలందరికీ కడుపునింపితే తర్వాత వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు తొలగించివేసి పేదల కడుపు కొట్టాడని,అయినాసరే చంద్రబాబునాయుడు ఆదేశాలమేరకు నాలుగున్నరేళ్ళుగా పిఠాపురంలో వర్మాస్ కావ్య ఫౌండేషన్ ద్వారా తాను పేదల ఆకలి తీర్చానని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ పేర్కొన్నారు.వాయిస్ ఓవర్:–పిఠాపురం కాయగూరల మార్కెట్ సెంటర్ వద్ద వర్మాస్ కావ్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ను టీడీపీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే వర్మ సందర్శించారు.పేదలకు మాజీ ఎమ్మెల్యే వర్మే స్వయంగా వడ్డించి,వారితోపాటు ఆయన కూడా భుజించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వర్మ మీడియాతో మాట్లాడుతూ.,ఆగష్టు 15 నుంచి కూటమి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించనుందని,ఇకనుంచి పేదలంలరూ అన్నాక్యాంటీన్లలో వారి ఆకలిని తీర్చుకోవాలని విజ్ఞప్తిచేశారు.ఈ నాలుగున్నరేళ్ళూ అన్నా క్యాంటీన్ నిర్వహణకు సహకరించిన పార్టీ నాయకులకు,కార్యకర్తలకు,నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండేపూడి ప్రకాశ్,పిల్లి చిన్నా,నామా దొరబాబు,స్వామిరెడ్డి అప్పలరాజు,సఖుమళ్ళ గంగాధర్,సోము సత్తిబాబు,సూరవరపు సుబ్బారావు,నల్లా శ్రీను,చవ్వాకుల రామచంద్రరావు,రావుల రమేశ్,నూతాటి ప్రకాశ్,శీరం భద్రరావు,ఆలం దొరబాబు తదితరులు పాల్గొన్నారు..

# విశాఖ ఏజెన్సీ స్థానిక ప్రజాప్రతినిధులకు జగన్ తాయిలం...

## దక్షిణ భారత యాత్రకు పంపుతున్న వైనం

అమరావతి,ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విజయం ఏమంత తేలిక కాదని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్రెడ్డికి అర్థమైపోయింది.దాని పరిధిలోని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో. వైసీపీకి పూర్తి మెజారిటీ ఉన్నా.. పదికి పది స్థానాలను టీడీపీ కూటమి గెలుచుకోవడం మింగుడుపడడం లేదు. దీంతో ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఓటర్లుగా ఉన్న వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లను కాపాడుకునే ప్రయత్నాల్లో పడ్డారు. టీడీపీ కూటమికి వారెవరూ అందుబాటులో లేకుండా కుటుంబాలతోపాటు దక్షిణ భారత యాత్రకు పంపుతున్నారు.ఇప్పటికే అరకు, పాడేరు నియోజకవర్గాలకు చెందినవారిని బెంగళూరు తీసుకెళ్లినట్లు వైసీపీ నేతలు చెబుతున్నారు. ఇక పెందుర్తి, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు తమ కుటుంబసభ్యులతో గురువారం తాడేపల్లి నివాసానికి తరలివచ్చారు. వారినుద్దేశించి జగన్ మాట్లాడుతూ. ప్రత్యర్థి పార్టీలు ఐదు లక్షలు ఇస్తాం. పది లక్షలు ఇస్తామని బేరసారాలు చేస్తాయని. వాటికి లొంగిపోయి అమ్ముడుపోవద్దని సూచించారు. 2014లో వైసీపీ నుంచి గెలిచి. టీడీపీలోకి వెళ్లిన 23 మంది ఎమ్మెల్యేలకు రూ.20 కోట్ల చొప్పున ఇస్తామని నమ్మించి.కేవలం అడ్వాన్సు ఇచ్చి వదిలేశారని చెప్పారు. ఇప్పుడు కూడా విశాఖ జిల్లా స్థానిక ప్రజాప్రతినిధులకు అడ్వాన్సులతోనే సరిపుచ్చుతారని హెచ్చరించారు. అప్పుడు టీడీపీలోకి వెళ్లినవారు మోసపోయామని తెలిసి వెనక్కి వస్తామంటే రాజకీయ విలువల కోసం తాను రావద్దన్నానంటూ బుధవారం అరకు, పాడేరు నియోజకవర్గాల ప్రతినిధులకు చెప్పిన మాటే చెప్పారు.

# టీడీపీ గూటికి మురుగుడు

గుంటూరు, ఆగస్టు 9 ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్‌సీకి ఏమీ కలసి రావడం లేదు. తాజాగా మంగళగిరి నుంచి పోటీ చేసిన అభ్యర్థి మురుగుడు లావణ్య మామ , మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు వైసీపీకి గుడ్ బై చెప్పే అవకాశం కని?స్తోంది. మంగళగిరిలో జరిగిన ఓ కల్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమంలో నారా లోకష్ తో పాటు ఆయన కూడా పాల్గొన్నారు. అదే వేదిక మీద నుంచి చంద్రబాబుపై ప్రశంసల వర్షం కురిపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు పద్మశాలి కుల వృత్తుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు వీవర్సకు జిఎస్టి లేకుండా కేంద్రంతో మాట్లాడి తీసేస్తామని హామీ ఇచ్చారన్నారు. చేనేతలకు మగ్గాలు లేని వారికి సొంత ఇల్లు నిర్మిస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీకి వైఎస్ఆర్సిపి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అంశం మంగళగిరిలో చర్చనీయాంశంగా మారింది . టీడీపీలో చేరేందుకు నిర్ణయించుకునే ఆయన ఇలా మాట్లాడుతున్నారని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి.మురుగుడు హనుమంతరావు మొదట్లో కాంగ్రెస్ పార్టీ లో ఉండేవారు. ఆయన 1999, 2004లో కాంగ్రెస్ పార్టీ తరపున రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మరోసారి 2009లో ఆయనకు టిక్కెట్ దక్కలేదు కానీ ఆయన వియ్యంకురాలు కాండ్రు కమలకు కాంగ్రెస్ టిక్కెట్ దక్కింది. ఆమె కూడా విజయం సాధించారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ గడ్డు పరిస్థితుల్లోకి వెళ్లింది. వైసీపీలో చేరినా మురుగుడు హనుమంతరావుకు టిక్కెట్ దక్కలేదు. వైసీపీ తరపున రెండు సార్లు ఆళ్ల రామకృష్ణారెడ్డి పోటీ చేసి విజయం సాధించారు. మురుగుడు హనుమంతరావు మధ్యలో ఓ సారి టీడీపీలో చేరి .. టీడీపీ ఓడిపోయిన తర్వాత మళ్లీ వైసీపీలో చేరారు. వైసీపీ అధినేత జగన్ మురుగుడు హనుమంతరావుకు ఎమ్మెల్సీ ఇచ్చారు. చేనేతవర్గం నుంచి అభ్యర్థిని లోకేష్‌పై పోటీకి పెట్టాలని డిసైడ్ కావడంతో మురుగుడు హనుమంతరావుతో పాటు కాండ్రుకమల కూడా టిక్కెట్ కోసం గట్టి ప్రయత్నం చేశారు. కానీ టీడీపీ నుంచి ఓ సారి ఎన్నికల్లో పోటీ చేసిన గంజి చిరంజీవిని పార్టీలో చేర్చుకున్న జగన్ ఆయనకే టిక్కెట్ ఇవ్వాలనుకున్నారు. కానీ లోకేష్ ను ఎదుర్కోలేకపోతున్నారని చివరి క్షణంలో మురుగుడు హనుమంతరావు కోడలు, కాండ్రు కమల కుమార్తె అయిన లావణ్యకు టిక్కెట్ ఇచ్చారు. అయితే ఆమె కూడా కనీస పోటీ ఇవ్వలేకపోయారు. 90వేలకుపైగా ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఎన్నికలు ముగిసిన తర్వాత వైసీపీ కీలక నేత ఇంట్లో పెద్ద ఎత్తువ మద్యం నిల్వలు బయటపడ్డాయి. ఈ మద్యం నిల్వలు మురుగుడు లావణ్య తండ్రివేనని పోలీసులు తేల్చారు. దీంతో కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో వారు వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనడం తగ్గించారు. ఇప్పుడు నేరుగా చంద్రబాబును పొగడటంతో వారు పార్టీ మారుతారన్న ప్రచారం ప్రారంభమయింది.

# కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ మరియు కోర్టు లైసెన్ ఆఫీసర్స్ తో సమీక్షా సమావేశం

రామగుండం,కోర్టు డ్యూటీ ఆఫీసర్ లు నేరస్థులు శిక్షల నుండి తప్పించుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించి నేరస్తులకు శిక్షలు పడుటకు కృషి చేయాలని రామగుండము పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ ఐజి, అన్నారు. రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిదిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిదిలోని పోలీస్ స్టేషన్ లలో పనిచేస్తున్న కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ మరియు కోర్టు లైసెన్ ఆఫీసర్స్ తో కమిషనరేట్ లో సిపి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ. కోర్టు కానిస్టేబుల్ కోర్టు కేలండర్ తయారు చేసుకోవాలని, నిందితులకు శిక్షలు పడేటట్లు సాక్షులను మోటివేషన్ చేయాలన్నారు. ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, షెడ్యూల్ ప్రకారం సాక్షులను కోర్టులో హాజరుపర్చాలని సూచించారు. పెండింగ్, పెట్టి కేసులు వెంటనే డిస్పోజల్ చేయాలని, నేరస్తులకు శిక్షలు పడితే నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. కోర్ట్, వారెంట్స్ , సమన్స్, వర్టికల్స్ గురించి పోలీస్ స్టేషన్లో పని చేస్తున్న కోర్ట్ కానిస్టేబుల్ అధికారులు తమ విధిలో భాగంగా ఎప్పటికప్పుడు ఎన్.బి.డబ్లూ. నాన్ బేలబుల్ వారెంటులను, క్రమం తప్పకుండా అమలు పరిచి నేరస్తులకు శిక్షలు పడేవిధంగా కృషిచేయాలని, కన్విక్షన్ రేటును పెంచాలని అన్నారు. కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైనదని, నేర రహిత సమాజముగా తీర్చిదిద్దాలంటే నిందితులకు కోర్టులో శిక్షపడే విధంగా కోర్టు డ్యూటీ పోలీసు సిబ్బంది శ్రమించాలని, ఇందుకోసం ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటి నుండి కేసు పూర్తయ్యేంతవరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల వాగ్మూలంను కోర్టుకు సమర్పించడంలో కోర్టు కానిస్టేబుల్ ప్రత్యేక శ్రద్ధ, బాధ్యత తీసుకోవాలని సూచించారు.

కోర్టు నందు ఎఫ్ఐఆర్ లను సరైన సమయంలో అందించాలని కేసుల్లో ఉన్నటువంటి ప్రాపర్టీని సరైన సమయంలో కోర్టు నందు డిపాజిట్ చేయాలి.

## ఎటకేకలకు డిస్టోకియా కేసు సుఖాంతం



సంజామల మండలం /శ్రీ ప్రస్థానం న్యూస్: సంజామలలో శ్రీను అనే రైతు సంబంధించి డిస్టోకియా కేసును ఏడి డా మోహన్ రావు ఆదేశాలతో దాదాపు నాలుగు గంటల పాటు శ్రమించి అత్యంత కష్టంపై సంజామల, బనగానపల్లె 1962 అంబులెన్స్ పశు వైద్య అధికారులు కస్తూరి, తస్లిం ఆధ్వర్యంలో ఎటకేకులకు దూడను బయటికి తీశారు. కాగా ఇప్పటికే దూడపిల్ల మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పారవేట్లు అస్లం, హుస్సేన్ వల్లి, పైలెట్ ఓబులేసు, రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మార్వో అనిల్ కుమార్ ని కలిసిన టిడిపి కార్యకర్తలు



సంజామల మండలం/ఆగస్టు 9 శ్రీ ప్రస్థానం న్యూస్: సంజామల మండలం ఇంచార్జ్ తాసిల్దార్ గా పి అనిల్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టిడిపి నేత పెండికంటి కిరణ్ కుమార్ కార్యకర్తలతో కలిసి తాసిల్దార్ కార్యాలయంలో ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. తాసిల్దార్ అనిల్ కుమార్ పుష్పగుచ్చం అందజేసి పిండకండి కిరణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా రెవెన్యూ సంస్థల పరిష్కారానికి కృషి చేస్తానని తాసిల్దార్ అనిల్ కుమార్ పేర్కొన్నారు.

## ఈ-పంట నమోదు తప్పని సరి.

### మండల వ్యవసాయధికారినీ కె. సునీత.



దొర్ని పాడు, శ్రీ ప్రస్థానం న్యూస్:- ఖరీఫ్ సీజన్లో భాగంగా రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటలకు తప్పని సరిగా ఈ- పంట నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీ గా చేయించాలని మండల వ్యవసాయధి కారినీ కె.సునీత, ఆయా గ్రామ వీ ఏ ఏ.లకు ఆదేశించారు. ఏ. ఓ.ఆదేశాల మేరకు గురువారం మండలంలోని డబ్ల్యు. కొత్త పల్లె, గ్రామ వ్యవసాయ సహాయకులు వంశీ, రైతులు సాగు చేసినటు వంటి ప్రత్తి, మిరుప,మినుము తదితర పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వారి సమక్షం లోనే ఈ - పంట నమోదు కార్యక్ర మాన్ని నిర్వహించారు.. ఈ సంధర్భంగా గ్రామ వ్యవసాయ సహాయకులు వంశీ మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పొందేందుకు వీలవుతుందని అన్నారు లేని యెడల ప్రభుత్వం అందించే నష్ట పరిహారం పొందెందుకు అనర్హులు అవుతారని రైతులకు సూచించారు..ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు..

## వైసీపీ నాయకుడు రవీందర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన వైసీపీ అధినేత జగన్

శ్రీ ప్రస్థానం-గడివేముల:- ఆగస్టు 10:- మండల పరిధిలోని ఓండుట్ల గ్రామంలో నెల రోజుల క్రితం టిడిపి కార్యకర్తల దాడిలో గాయపడిన రవీందర్ రెడ్డి కుటుంబ సభ్యులను వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు.. ఘటన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. నిందితులకు శిక్ష పడేలా పోరాడతామని జగన్ బాధిత కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆ కుటుంబానికి ధైర్యం చెప్పిన ఆయన.పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



# పట్టుదలతో చదివి కన్న కలలను సాకారం చేసుకోండి



### చదువుకుంటే ఉన్నత శిఖరాలు చేరుకోగలరు
### పదో తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించాలి
### గురుకుల పాఠశాలలోని ఆర్ఓ వాటర్ ప్లాంట్, వంటశాల, బాత్రూం, పరిసరాల శుభ్రత పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్‌జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు,ఆగస్టు 09:- పట్టుదలతో చదివి కన్న కలలను సాకారం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా 10వ తరగతి విద్యార్థులను ఉద్దేశిస్తూ తెలిపారు. శుక్రవారం స్థానిక బి క్యాంప్ లోని బాలికల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ పదవ తరగతి, తొమ్మిదవ తరగతి విద్యార్థులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ క్లాస్ రూమ్ లో పదవ తరగతి, తొమ్మిదవ తరగతి విద్యార్థులు ఎంతమంది ఉన్నారనే వివరాలను ప్రిన్సిపల్ ని అడిగి తెలుసుకున్నారు.. వివిధ సబ్జెక్ట్ లకు సంబంధించిన ఉపాధ్యాయులు పాఠాలను ఇంగ్లీషులో చెప్తున్నారా? లేదా? ఒకవేళ పాఠాలు ఏవైనా అర్థం కాకపోతే ఉపాధ్యాయులు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ ద్వారా వీడియో రూపంలో వివరిస్తున్నారా? లేదా? గణితం, ఇంగ్లీష్, సైన్స్ సబ్జెక్టు లలో ఇప్పటివరకు ఎన్ని చాప్టర్ లు చెప్పారని పదవ తరగతి విద్యార్థులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు.. మీరు జీవితంలో ఏం అవ్వాలనుకుంటున్నారు? మీ ఆశయాలు ఏంటి? అని కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు .. చాలా మంది విద్యార్థులు జీవితంలో కలెక్టర్, ఎస్పీ, డాక్టర్, లాయర్ స్థానాల్లో ఉండాలనుకుంటున్నామని వారి యొక్క ఆశయాలను కలెక్టర్ కి తెలిపారు.. కలెక్టర్ స్పందిస్తూ జీవితంలో ఏదైనా ఆశయం సాధించుకోవాలని అనుకోవడంలో తప్పు లేదని, కానీ వాటిని సాధించే విషయంలో పట్టుదలతో చదివి కన్న కలలను సాకారం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.. "కలలు కనండి వాటిని సాధించేందుకు శ్రమించండి" అనే అబ్దుల్ కలం కొటేషన్ ను కలెక్టర్ ఈ సందర్భంగా విద్యార్థులకు గుర్తు చేశారు. ప్రతి ఒక్క విద్యార్థికి ఒక ఆశయం ఉండాలని అప్పుడే ఆ ఆశయం నెరవేర్చుకునేందుకు వారు కష్టపడతారని, ఆశయం లేని విద్యార్థులు ఎవరు ఉండకూడదని కలెక్టర్ పేర్కొన్నారు.. ఆశయం ఉన్న విద్యార్థులకు నిద్ర సైతం లేకుండా వాటిని సాధించేందుకు కష్టపడతారన్నారు. జీవితంలో బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడి సమాజసేవ చేయాలనుకుంటే, ఇక్కడ ఉన్న అధికారులను, ఉపాధ్యాయులను ఉదాహరణగా తీసుకొని ప్రతిరోజు బాగా కష్టపడి చదువుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు.. ఆశయం ఉన్న విద్యార్థులు పాస్ అయిన, ఫెయిల్ అయిన, వారు జీవితంలో ఎప్పుడు మాత్రం ఆశయం వదులుకోకుండా నిరంతరాయంగా ఆశయ సాధనకై ప్రయత్నిస్తూనే ఉండాలని, వారి ప్రయత్నాలు ఏదో ఒక రోజు వారిని ఉన్నత స్థాయిలో చేరే విధంగా చేస్తాయన్నారు.. పదవ తరగతి పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని, ఏ ఒక్క విద్యార్థి కూడా పదవ తరగతిలో ఫైల్ కాకుండా చూసుకోవాలన్నారు..ప్రైవేట్ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయుల కంటే ఇక్కడ ఉన్న ఉపాధ్యాయులు ఎంతో కష్టపడి మెరిటోరియస్ సాధించి ఉద్యోగం సాధించిన వారని ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులు సరిగా చదవలేని విద్యార్థుల మీద ప్రత్యేక దృష్టి సారించి వారికి అదనంగా ట్యూషన్స్ నిర్వహించినట్లయితే ఏ ఒక్క విద్యార్థి కూడా 10వ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అవ్వదని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. ఒక్కొక్క విద్యార్థిలో ఇంటలిజెన్స్ (ఐక్యూ) అనేది ఒక్కొక్క లాగా ఉంటుందని, కానీ ప్రతి ఒక్క విద్యార్థికి కష్టపడే తత్వం మాత్రం కచ్చితంగా ఉండాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. 10వ తరగతి పరీక్షలలో ఎన్ని మార్కులు వచ్చాయనేది ముఖ్యం కాదని జీవితంలో ఎన్నో అవకాశాలు ఉంటాయని ఈ విషయాన్ని ప్రతి ఒక్క విద్యార్థి గుర్తుంచుకోవాలని, పదవ తరగతి పరీక్షల మీద ఎక్కువగా స్ట్రెస్ తీసుకోవద్దని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు..అనంతరం పదవ తరగతి చదువుతున్న నందిని అనే అమ్మాయిని పిలిపించి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ మీద మ్యాథ్స్ లెక్కను కలెక్టర్ స్వయంగా చేయించారు.. తొలుత కలెక్టర్ గురుకుల పాఠశాలను పరిశీలిస్తూ గతంలో ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమం పాఠశాలగా ఉన్నదాన్ని తాను ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ గా ఉన్నప్పుడు గురుకుల పాఠశాలగా మార్చడం జరిగిందని, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు కూడా ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ గా ఉన్నపుడే సాంక్షన్ చేయించడం జరిగిందని కలెక్టర్ గుర్తుచేశారు.. సంపును నెలలో ఎన్నిసార్లు శుభ్రం చేయిస్తున్నారని, వంటశాలలో వంటలు గ్యాస్ తోనే చేయిస్తున్నారా? లేదా? అని కలెక్టర్ ప్రిన్సిపల్ ని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పాఠశాలలో ఉన్న టీచర్స్ స్ట్రెంత్ వివరాలను కలెక్టర్ ప్రిన్సిపల్ ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సంత్ సేవాలల్ చిత్రపటాలకు పూలమాలవేసి కలెక్టర్ నివాళులర్పించారు..గురుకుల పాఠశాలలోని ఆర్ఓ వాటర్ ప్లాంట్ ద్వారా కొళాయి కి వస్తున్న త్రాగు నీరు కలెక్టర్ స్వయంగా త్రాగి సంతృప్తి వ్యక్తం చేశారు.. అదే విధంగా వంటశాలను కలెక్టర్ పరిశీలిస్తూ వంటశాలలో పనిచేస్తున్న వారి వివరాలను ప్రిన్సిపల్ ని అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. బాత్రూం, పరిసరాల శుభ్రత పనితీరు పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.. 3, 4 వ తరగతి విద్యార్థుల క్లాస్ రూమ్ ను పరిశీలిస్తూ మూడో తరగతి చదువుతున్న దేవకి అనే అమ్మాయితో కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఊరు నుండి వచ్చావు? మెనూ ప్రకారమే భోజనం ఇస్తున్నారా? యూనిఫామ్, బ్యాగ్స్, షూస్, బెల్ట్, టెక్స్ట్ బుక్స్ , నోట్ బుక్స్ అందజేశారా? లేదా? అని విద్యార్థులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు..కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, ఇన్చార్జి గిరిజన సంక్షేమ అధికారి రంగలక్ష్మి దేవి, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు,గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మి గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు..

# ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నాం..

### రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్
### పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డితో కలిసి ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌ను పరిశీలించిన మంత్రి భరత్






కర్నూలు ఆగస్టు 09:జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీని సందర్శించి యాజమాన్యం, పరిశ్రమల శాఖ అధికారులతో మంత్రి సమావేశంఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ చెప్పారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో కలిసి ఆయన ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్‌ను పరిశీలించారు. అంతకుముందు ఎయిర్‌పోర్టు సమీపంలో టిడిపి ప్రభుత్వ హయాంలో సీఎం చంద్రబాబు ఇండస్ట్రియల్ జోన్‌కు శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. కొందరు దుండగులు శిలాఫలకం ధ్వంసం చేయడాన్ని ఆయన ఖండించారు. ఆ తర్వాత ఇండస్ట్రియల్ జోన్‌కు వెళ్లి అధికారులతో మాట్లాడారు. నీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ఏపీఐఐసీ అధికారులతో చర్చించారు. అనంతరం జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీని సందర్శించి ఫ్యాక్టరీ యాజమాన్యం, ఏపీఐఐసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీకి సంబంధించిన వివరాలను మంత్రి టి.జి భరత్, ఎమ్మెల్యే చరితారెడ్డికి ఫ్యాక్టరీ యాజమాన్యం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సీఎం అవ్వడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయిన పరిశ్రమలు మళ్లీ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నాయని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో విధ్వంసం తప్ప జరిగిందేమీ లేదన్నారు. తమ టిడిపి ప్రభుత్వం అభివృద్ధే మంత్రంగా ముందుకు వెళుతోందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ యాజమాన్యం.. మళ్లీ టిడిపి ప్రభుత్వం రావడంతో ఇప్పుడున్న ఫ్యాక్టరీని మరింత విస్తరించేందుకు ముందుకొస్తోందని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ సహకారం లేకపోవడంతో జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణం నెమ్మదిగా సాగిందన్నారు. ప్రభుత్వం తరుపున ఫ్యాక్టరీకి అందించాల్సిన విద్యుత్, వాటర్, రైల్వే సైడింగ్స్ ఏదీ గత ప్రభుత్వం చేయలేదన్నారు. పారిశ్రామికవేత్తలందరితో చర్చలు జరుపుతున్నామని.. వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వారందరూ ఆసక్తిగా ఉన్నట్లు మంత్రి టి.జి భరత్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఏపీ నుండి వెళ్లిపోయిన ఓ పరిశ్రమ చెన్నైలో రూ.3 వేల కోట్లతో ప్లాంటును ఇప్పుడు నడుపుతుందని తెలిపారు. మళ్లీ మన రాష్ట్రానికి రావడానికి వాళ్లు ఆసక్తిగా ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్ లో మౌలిక సదుపాయాల కల్పనకు 1800 కోట్ల రూపాయలు ఇస్తున్నట్లు తెలిపారు. శ్రీసిటీ గ్రీన్ జోన్‌లో ఉందని, ఓర్వకల్లు రెడ్ జోన్‌లో ఉండటంతో ఎలాంటి పరిశ్రమలైనా ఇక్కడ ఏర్పాటుచేయొచ్చన్నారు. ఇలాంటి చోట మౌలిక సదుపాయాలు బాగా కల్పిస్తే ఓర్వకల్లులో పరిశ్రమలు భారీగా ఏర్పాటయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. అందుకే బెస్ట్ కన్సల్టెన్సీతో మాట్లాడి ఇండస్ట్రియల్ జోన్లో సమస్యలేమైనా ఉంటే గుర్తించి సరిచేసుకుంటామన్నారు. జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ యాజమాన్యం సమస్యలను పరిష్కరిస్తామన్నారు. తమ ప్రభుత్వం మరో రెండు దశాబ్దాల పాటు కొనసాగుతుందని.. పారిశ్రామికవేత్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఏపీని అభివృద్ధిలో ముందుకు తీసుకెళతామన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్లో పెట్టుబడులు ఊహించిన దానికంటే ఎక్కువగానే వస్తాయన్నారు. ఇక్కడ నీరు, విద్యుత్, రోడ్డు, రైల్వే లైన్ ఇతర సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే కర్నూలు నుండి విజయవాడకు విమాన సర్వీసులు ప్రారంభమవు తాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పారిశ్రామిక వాడను అభివృద్ధి చేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని, ఇక్కడ అనేక పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా ఈ గ్రామాలలోని యువతకు ఉద్యోగావకాశాలు కూడా కల్పించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ ఎండి కొయాంక, కర్నూల్ ఆర్డీవో శేషిరెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, ఇండస్ట్రీస్ జిఎం మారుతి ప్రసాద్, ఓర్వకల్లు తహసిల్దార్ వెంకటరమణ, ఇండస్ట్రియల్ ఏఈ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణకొట్కూరు వైసీపీ ఎంపీటీసీలు టీడీపీలోకి



నందికొట్కూరు := నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు కు చెందిన వైసీపీ ఎంపీటీసీలు సురేష్ బాబు, నాగేశ్వరరావు లు శుక్రవారం టీడీపీ పార్టీలో చేరారు. టీడీపీ నాయకులు ఉదయ్ కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ ఇంచార్జి.మాండ్ర శివానంద రెడ్డి , నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య టీడీపీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితోపాటు మాజీ విద్యా కమిటీ చైర్మన్ రెడ్డిపోగు గిడ్డయ్య టీడీపీ పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖాజా బాషా, జడ్పీ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కట్టుబడి పుల్లన్న, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిబిజి ప్లాంట్ ఏర్పాటుకు స్థలపరిశీలన





కర్నూలు ఆగస్టు 09:చెత్త నుండి బయో గ్యాస్ తయారు చేసే కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ (సిబిజి) ఏర్పాటుకు కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్ స్థలాన్ని పరిశీలించారు. శుక్రవారం స్వచ్ఛంద్ర కార్పొరేషన్, నరగపాలక ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి కమిషనర్ గార్గేపురం డంప్‌యార్డులో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి ఏటా టన్నుల కొద్దీ వ్యర్థాలు ఉత్పత్తి అవుతుండటంతో భూమి కలుషితమై పోతుందని, ఈ సమస్యకు పరిష్కారంగా సిబిజి ప్లాంటు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ పేర్కొన్నారు. దీని ద్వారా చెత్త నుండి సంపద సృష్టి అలాగే పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. సిబిజి ప్లాంట్ నిర్మాణానికి 10 ఎకరాల భూమి అవసరం అవుతుందని, అక్కడ బయో గ్యాస్ తయారు చేసి వాహనాలకు నింపవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈ షాకీర్, డిసిపి సంధ్య, డిఈఈ నరేశ్, ఏఈ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహా వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి.: వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే

నందికొట్కూరు :=నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామంలో మండ్లెం గ్రామ మాజీ సర్పంచ్ ఎర్రమల వెంకటరమణ సోదరుడుసామేలు, వెంకట రమణమ్మ దంపతుల కుమార్తె మెర్సీ, ఉసేన్ ల వివాహ వేడుక రిసెప్షన్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నందికొట్కూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వదువరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వై వి రమణ, వైస్ ఎంపీపీ తోకల కృష్ణా రెడ్డి, అడ్వకేట్స్ బార్ కౌన్సిల్ అధ్యక్షులు వెంకట రాముడు, వెంకటేష్, కోకిల రమణా రెడ్డి, పాత్రికేయులు స్వామన్న, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757